సూర్య నేటి దినపత్రిక www.suryaa.com
18 వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
4 PM www.suryaa.com
గురువారం 13-02-2025 పేజీలు: 02



కన్నప్ప కోసం ప్రభాస్
## ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అతిథి పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు కుటుంబం నుంచి వస్తున్న ఈ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటి-స్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఈ చిత్రం. ఇప్పటికే వరుస ప్రమోషన్స్ చేస్తున్న ఈ చిత్రం నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్ రుద్రుడిగా కనిపించబోతు-న్నాడు. అయితే ఈ సినిమా కోసం ప్రభాస్ తీ-సుకున్న రెమ్యునరేషన్‌కి సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు విష్ణు. ఒక సినిమా ఇంటర్వ్యూలో భాగంగా విష్ణు మాట్లా-డుతూ.. ఈ సినిమా కోసం ప్రభాస్ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని, తన తండ్రి మోహన్ బాబుపై ఉన్న గౌరవంతోనే ఈ సినిమా చేశాడంటూ చెప్పకోచ్చాడు. మరోవైపు మలయాళ నటుడు మోహన్ లాల్ కూడా ఈ సినిమా కోసం ఎటువంటి రెమ్యునరేషన్ తీసు-కోలేదని తెలిపాడు.



# వల్లభనేని వంశీ అరెస్ట్.. పోలీసుల గుప్పిట్లో గన్నవరం!

కూటమి సర్కార్ పాలనలో కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. అక్రమ కేసుల్లో భాగంగా తాజాగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఏపీ పోలీసులు.. హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. నాటకీయ పరిణామాల మధ్య వంశీని విజయవాడకు తరలిస్తున్నారు. వంశీ అరెస్ట్ నేపథ్యంలో గన్నవరంలో పోలీసులు హై అలర్ట్ విధించారు. వైఎస్సార్‌సీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేస్తున్నారు. పార్టీ శ్రేణులను బయటకు రానివ్వడం లేదు. ప్రధాన ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్టీ కార్యకర్తలు బయటకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించింది. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై కూడా కేసులు పెట్టింది. దీంతో, ఆయనను అరెస్ట్ చేసేందుకు విజయవాడ పడమట పోలీసులు ప్లాన్ ప్రకారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గచ్చిబౌలిలోని వంశీ ఇంటికి చేరుకుని నాటకీయ పరిణామాల మధ్య అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఎన్ఎస్ సెక్షన్ 140(1), 308, 351(3) రెడ్‌విత్ 3(5) కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. అలాగే, వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు సైతం పోలీసులు నమోదు చేశారు. ఇదే సమయంలో కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అరెస్ట్ చేస్తున్నట్టు వంశీ భార్యకు పోలీసులు నోటీసుల్లో తెలిపారు. అనంతరం, వంశీని అరెస్ట్ చేసి విజయవాడకు తరలిస్తున్నారు.



# ఎక్స్‌పై ట్రంప్ దావా

అమెరికాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. 2021లో క్యాపిటల్ హిల్స్‌పై దాడి నేపథ్యంలో ట్రంప్ సోషల్ మీడియా ఖాతాలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ట్రంప్‌కు చెందిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఖాతాలపై ఆయా సంస్థలు నిషేధం విధించాయి. దీంతో ఆ సంస్థలపై ట్రంప్ అప్పట్లోనే దావా వేశారు. ఇప్పుడు ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడంతో ఆయా సంస్థలు సెటిల్‌మెంట్ చేసుకునేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగానే ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్' ట్రంప్‌కు 10 మిలియన్ డాలర్లు (రూ.86 కోట్లు) చెల్లించేందుకు డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. కాగా, 2020లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2021 జనవరి 6న అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ విజయాన్ని ధ్రువీకరించేందుకు అమెరికా కాంగ్రెస్ వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ భవనంలో సమావేశమైంది. ఆ సమయంలో వేలాది మంది ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ సోషల్ మీడియా ఖాతాలు ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌పై నిషేధం విధించారు. దీంతో ట్రంప్ ఆయా సంస్థలపై దావా వేశారు. అనంతరం 2023లో వాటిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ట్రంప్ మరోసారి అధికారం చేపట్టడంతో వీటిని సెటిల్ చేసుకునేందుకు ఆయా సంస్థలు ముందుకొచ్చాయి. ఇటీవలే మెటా సంస్థ 25 మిలియన్ డాలర్లకు సెటిల్‌మెంట్ కుదుర్చుకున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మస్క్‌కు చెందిన ఎక్స్ సైతం ట్రంప్‌తో డీల్‌కు సిద్ధమైనట్లు అమెరికా మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.

## జనగామలో అగ్నిప్రమాదం

జనగామ జిల్లా కేంద్రంలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్తినష్టం వాటిల్లింది. జనగామ పట్టణంలోని జై భవాని ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్, పెయింట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. దుకాణాల దగ్గరలోని ఇళ్లలో ఉన్న ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు. రూ. 50 లక్షలకు పైగానే ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. అగ్నిమాపక వాహనాలు వచ్చే సరికి విలువైన పరికరాలు, సామాగ్రి పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి. సంఘటన జరిగిన స్థలానికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ చేతన్ నితిన్ , జనగామ సీఐ దామోదర్ రెడ్డి, నర్మెట్ట సీఐ అబ్బ య్య చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బ ందికి సమాచారం అందించడంతో వెంటనే సంటఘన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. భారీగా ఆస్తి నష్టం జరగడంతో దుకాణ యజమానులతో పాటు కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



ప్రేమికుల దినోత్సవం సందర్భంగా
## ఇండిగో బంపరాఫర్

విమానయాన సంస్థ ఇండిగో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. ఎంపిక చేసిన దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణానికి ఈనెల 16 వరకు బుక్‌చేసే టికెట్లపై 50 శాతం వరకు రాయితీ ఇవ్వనుంది. ఇద్దరు ప్రయాణికులు కలిసి బుక్‌చేస్తేనే ఆఫర్ వర్తిస్తుంది. బుకింగ్‌కి, ప్రయాణానికి మధ్య కనీసం 15 రోజుల వ్యవధి ఉండాలి. తొలి 500 మందికి అదనంగా మరో 10 శాతం రాయితీ లభిస్తుంది.

## ఇంటర్ అడ్మిషన్స్‌పై ఇంటర్మీడియట్ బోర్డు కీలక ప్రకటన

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ పూర్తికాకముందే, జూనియర్ కాలేజీల్లో అనధికారిక ప్రవేశాలు చేపడుతన్నారన్న వార్తలు ఇంటర్మీడియట్ బోర్డు పై వస్తున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ బోర్డు వాస్తవాలను వెల్లడించింది. రాబోయే విద్యా ఏడాదికి సంబంధించి 2025-2026 కోసం అనుబంధ నోటిఫికేషన్ అడ్మిషన్ షెడ్యూల్‌ను ఇంకా జారీ చేయలేదని ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.ఈ నేపథ్యంలో ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి తాము ఇంకా షెడ్యూల్ జారీ చేయలేదనీ, విద్యార్థులు- తల్లిదండ్రులు షెడ్యూల్‌కు ముందే ప్రవేశాలు చేపట్టరాదని సూచించింది. షెడ్యూల్ ఎప్పుడు విడుదల చేసేది త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఇంటర్ బోర్డు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. కొత్త అకడమిక్ సెషన్‌కు ఇంటర్ బోర్డు ఇచ్చే షెడ్యూల్ ప్రకారంగానే ప్రవేశాలు చేపట్టాలని, ఇందుకు విరుద్ధంగా ప్రవేశాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.




## ఇచ్చిన హామీల అమలుకు పవన్ కళ్యాణ్ ఎందుకు బాధ్యత తీసుకోరు?

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియలేదా? వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. ఏపీలో కూటమి సర్కార్ హామీల అమలుకు పవన్ కళ్యాణ్ ఎందుకు బాధ్యత తీసుకోరు అని ఆయన నిలదీశారు. సనాతన ధర్మం అంటున్న పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేయరా?. శాంతి భద్రతల నిర్వహణలో చంద్రబాబు సర్కార్ విఫలమైందన్నారు. బుధవారం అనంతపురం నగరంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డితో కలిసి శైలజానాథ్ మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు పవన్ కళ్యాణ్ ఎందుకు బాధ్యత తీసుకోరు?. సనాతన ధర్మం అంటున్న పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేయరా?. టీడీపీ కూటమి.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసింది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ చంద్రబాబు జారుకునే యత్నం చేస్తున్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియలేదా? అని ప్రశ్నించారు.



## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

అమెరికా వాణిజ్య యుద్ధాలు, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూలతల కారణంగా భారీ నష్టాలను చవి చూస్తున్న దేశీయ సూచీలు గురువారం కాస్త కోలుకున్నాయి. లాభాలతో ప్రారంభమై కొంత ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు సాగించడంతో లాభాల బాట పట్టాయి. ఆసియా-పసిఫిక్ సూచీలు ఈ రోజు లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ కూడా లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి.బుధవారం ముగింపు (77, 171)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 190 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. అయితే కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో లాభాల్లోకి దూసుకొచ్చింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో 444 పాయింట్ల లాభంతో 76, 615 వద్ద కొనసాగుతోంది.

## కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో విద్యార్థినులను కరిచిన ఎలుకలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో నిర్లక్ష్యం బయటపడింది. ఇద్దరు విద్యార్థినులపై ఎలుకలు దాడి చేశారు. ఈ నెల 11వ తేదీన జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చంద్రుగొండలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో ఈ నెల 11వ తేదీ రాత్రి సమయంలో పదో తరగతి విద్యార్థినులు కాకటి స్వచ్ఛత, కాకటి గోపికలను ఎలుకలు కరిచాయి. కాళ్లపై ఎలుకలు కరిచిన విషయాన్ని వసతీగృహంలోని స్పెషల్ ఆఫీసర్ కవితకు తెలియజేశారు. దీంతో ఈ నెల 12వ తేదీన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థినులకు చికిత్స అందించారు. విద్యార్థినులను ఎలుకలు కరిచిన విషయం బయటకు పోకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. కాగా విద్యార్థినులను ఎలుకల కరిచిన విషయం వారి తల్లిదండ్రులు, బంధువుల ద్వారా బయటకొచ్చింది. విషయం తెలియగానే ఎంఈవో సత్యనారాయణ గురువారం నాడు వసతీగృహాన్ని తనిఖీ చేశారు. ఎలుకలు కరిచిన విద్యార్థినులను పరామర్శించారు.

# సుప్రీంకోర్టులో మోహన్‌బాబుకు ఊరట

జర్నలిస్ట్‌పై దాడి కేసులో ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో మోహన్‌బాబుకి సుప్రీంకోర్టు గురువారం ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసం వద్ద మీడియా ప్రతినిధిపై దాడి చేయడంపై పహాడీషరీఫ్ పోలీసులు మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.ఈ ఘటనలో మొదట ఆయనపై బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాత 109 సెక్షన్ కింద కేసు రిజిస్టర్ చేసి.. హత్యాయత్నం కేసుగా మార్చారు. ఈ దాడి ఘటనలో గాయపడ్డ జర్నలిస్ట్‌కు మోహన్ బాబు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఓ లేఖ కూడా విడుదల చేశారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్ట్ సోదరుడు గాయపడటం నాకు బాధ కలిగించింది. ఈ ఘటన తర్వాత అనారోగ్యం కారణంగా 48 గంటల పాటు ఆసుపత్రిలో చేరడంతో వెంటనే స్పందించలేకపోయా. ఆ రోజు నా ఇంటిగేటు విగిరిపోయింది.. దాదాపు 30 నుంచి 50 మంది వ్యక్తులు ఇంట్లోకి చొచ్చుకొచ్చారని.. ఆ సమయంలో సహనాన్ని కోల్పోయినట్లు లేఖలో వివరించారు. పరిస్థితి అదుపు చేసే క్రమంలో జర్నలిస్ట్‌కు గాయమైందని.. ఇది చాలా దురదృష్టకరమన్నారు. అతడికి, ఆయన కుటుంబానికి కలిగిన బాధకు తాను తీవ్రంగా చింతిస్తున్నట్లు చెప్పారు. గాయపడ్డ జర్నలిస్ట్ త్వరగా కోలుకోవాలని మోహన్‌బాబు కాంక్షించారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING 4PM EDITION



## రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణపై ఫౌరసరఫరాల శాఖ కీలక ప్రకటన!

రేషన్ కార్డుల దరఖాస్తులపై తెలంగాణ ఫౌరసరఫరాల శాఖ కీలక ప్రకటన చేసింది. రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ. దరఖాస్తుల సమర్పణకు గడువు ఏమీ లేదని స్పష్టం చేసింది. గత నెలలో సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రూపొందించిన జాబితాలో పేర్లు లేని కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం అప్లయ్ చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. నాటి నుంచి దరఖాస్తు దారులు కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవా సెంటర్లకు క్యూకడుతున్నారు. ఆఫ్‌లైన్‌లలో అప్లయి చేస్తున్నారు.అయితే, ఓ వైపు ఫిబ్రవరి 26న ఎవరైతే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారో వారికి రేషన్ కార్డులను మంజూరు చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తు దారులు తాము ఇప్పటి వరకు రేషన్ కార్డుల కోసం అప్లయి చేసుకోలేదని, ప్రయత్నిస్తే సర్వర్లు మొరాయిస్తున్నారని వాపోతున్నారు. కొత్త రేషన్ కార్డులు తమకు వస్తాయో ? లేదో ? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ఫౌర సరఫరాల శాఖ కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుపై స్పష్టత ఇచ్చింది. 'రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ. దరఖాస్తుల సమర్పణకు ఎలాంటి గడువు లేదు. దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సి అవసరం లేదు. ప్రజావాణిలో దరఖాస్తు చేస్తే మళ్లీ చేయాల్సిన అవసరం లేదు. మీ సేవలో అప్లయి చేస్తే రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, దాన్ని ఎక్కడా ఇవ్వాల్సిన అవసరలేదని సూచించింది.




## ఏపీలో ఓ వ్యక్తికి బర్డ్‌ఫ్లూ నిర్ధారణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కలకలం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో లక్షలాది కోళ్లు మృతి చెందుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ మనిషికి బర్డ్ ఫ్లూ వైరస్ సోకడం ప్రస్తుతం సంచలనం రేపుతోంది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలానికి చెందిన వ్యక్తికి బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆ వ్యక్తికి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఈ విషయాన్ని వైద్యారోగ్య శాఖ అధికారులు ధృవీకరించాల్సి ఉంది. కాగా, రెండు గోదావరి జిల్లాల పరిధిలో గత కొంత కాలంగా లక్షలాది కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమైన మృతి చెందిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపగా బర్డ్‌ఫ్లూగా తేలింది. తూర్పు గోదావరి జిల్లా కానూరు అగ్రహారం, వేల్పూరులోనూ ఓ కోళ్లను నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపగా.. బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయ్యింది. ఈ క్రమంలో అధికారులు అగ్రహారం పరిధిలోని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. మరో వైపు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యిన ప్రాంతంలో చికెన్ దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.



## లోన్ కట్టలేదని ఇంటి గేటు జప్తు
## డీసీసీబీ అధికారుల నిర్వాకం

గేదెల కోసం లోన్ తీసుకొని కట్టడం లేదని బ్యాంకు అధికారులు రుణగ్రస్థురాలి ఇంటి గేటును తీసుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మద్దెబోయిన ప్రేమలత ఐదుగురు గ్రూపు సభ్యులతో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ డీసీసీ బ్యాంకులో 2021లో రూ. 6 లక్షల లోన్ తీసుకున్నారు. రూ.3 లక్షల మేర చెల్లించి, మిగతా నగదు కట్టకపోవడంతో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ బ్యాంకు అధికారులతోపాటు మండల కేంద్రానికి చెందిన డీసీసీబీ అధికారులు ఏడునూతుల గ్రామానికి వచ్చి రుణం కట్టని ఇండ్లకు వెళ్లి అడిగారు. నోటీసులు పంపినా లోన్ కట్టకపోవడంతో అధికారులు ఆగ్ర హం వ్యక్తం చేస్తూ గేటును బాధితురాలి భర్తతోనే ఊడబీకించి ట్రాక్టర్‌లో వేయించారు. ఐదుగురు సభ్యు లు బ్యాంకు వారికి కట్టాల్సిన నగదు మొత్తం మాట్లాడి సెటిల్ చేసుకోవడంతో ప్రేమలతకు చెందిన గేటు అక్కడే వదిలి వెళ్లారు. మరో గ్రూపు లో వారు కూడా డబ్బు లు కట్టకపోవడంతో మద్దెబోయిన కళమ్మకు చెందిన గేటును తీసుకువెళ్లారు.

# పోస్టల్ సర్కిళ్లలో భారీగా ఉద్యోగాల భర్తీ

దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ పోస్టల్ సర్కిళ్లలో భారీగా ఉద్యోగాల భర్తీకి తాజాగా ఇండియా పోస్ట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 21,413 గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఖాళీలను ఈ నోటిఫికేషన్ కింద భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి ఎలాంటి రాత పరీక్ష లేకుండానే.. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపడతారు. ఈపోస్టులకు ఎంపికైనవారు బ్రాంచ్‌పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ హోదాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం ఖాళీల్లో ఆంధ్రప్రదేశ్‌లో 1215, తెలంగాణలో 519 చొప్పున ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైనవారు రోజుకు నాలుగు గంటలు పనిచేస్తే సరిపోతుంది. వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు గానూ ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ ఏబీపీఎం/ డాక్ సేవక్‌లకు ప్రోత్సాహం అందిస్తారు.



**రాష్ట్రాల వారీగా ఖాళీల వివరాలు..**

ఆంధ్రప్రదేశ్ పోస్టుల సంఖ్య: 1,215
అస్సాం పోస్టుల సంఖ్య: 555
బీహార్ పోస్టుల సంఖ్య: 783
ఛత్తీస్‌గఢ్ పోస్టుల సంఖ్య: 638
ఢిల్లీ పోస్టుల సంఖ్య: 30
గుజరాత్ పోస్టుల సంఖ్య: 1,203
హరియాణా పోస్టుల సంఖ్య: 82
హిమాచల్‌ప్రదేశ్ పోస్టుల సంఖ్య: 331
జమ్మూ అండ్ కశ్మీర్ పోస్టుల సంఖ్య: 255
జార్ఖండ్ పోస్టుల సంఖ్య: 822
కర్ణాటక పోస్టుల సంఖ్య: 1,135
కేరళ పోస్టుల సంఖ్య: 1,385
మధ్యప్రదేశ్ పోస్టుల సంఖ్య: 1,314
మహారాష్ట్ర పోస్టుల సంఖ్య: 1,498
నార్త్ ఈస్ట్రన్ పోస్టుల సంఖ్య: 1,260
ఒడిశా పోస్టుల సంఖ్య: 1,101
పంజాబ్ పోస్టుల సంఖ్య: 400
రాజస్థాన్ పోస్టుల సంఖ్య: 2718
తమిళనాడు పోస్టుల సంఖ్య: 2,292
తెలంగాణ పోస్టుల సంఖ్య: 519
ఉత్తర్ ప్రదేశ్ పోస్టుల సంఖ్య: 3,004
ఉత్తరాఖండ్ పోస్టుల సంఖ్య: 568
పశ్చిమ్ బెంగాల్ పోస్టుల సంఖ్య: 923

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎవరైనా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. అయితే మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా సబ్జెక్టులుగా చదివి ఉండాలి. వీరికి కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉండాలి. సైకిల్ తొక్కటం కూడా వచ్చి ఉండాలి. అభ్యర్థుల 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వరకు సడలింపు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో మార్చి 3, 2025వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవ చ్చు. దరఖాస్తు ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌ఉమెన్ లకు మాత్రం ఎలాంటి ఫీజు చెల్లింపులు ఉండవు. ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉండదు. కేవలం పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా మాత్రమే నియామకాలు చేపడతారు. ఎంపికైన వారి కి నెలకు బీపీఎం పోస్టులకైతే రూ.12000 నుంచి రూ.29,380, ఏబీపీఎం/ డాక్ సేవక్ పోస్టులకు రూ.10000 నుంచి రూ.24,470 వరకు జీతంగా చెల్లిస్తారు. ఎంపికైన వారిని ఖాళీగా ఉన్న బ్రాంచీలు, హోదా ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.

ముఖ్యమైన తేదీలు ఇవే..
ఆన్‌లైన్ దరఖాస్తులకు ప్రారంభ తేదీ: ఫిబ్రవరి 10, 2025.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 03, 2025.
దరఖాస్తు సవరణలకు అవకాశం: మార్చి 6, 2025 నుంచి మార్చి 8, 2025 వరకు

## ఉచితాలిస్తే ప్రజలు పనిచేయరు!

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉచితాల వల్ల ప్రజలు పనిచేయడానికి ఇష్టపడడం లేదని అసహనం వ్యక్తం చేసింది. తద్వారా వారు సోమరిపోతులుగా మిగిలిపోతున్నారని పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులైన వ్యక్తులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్ పై జస్టిస్ బీఆర్ గవాయ్, అగస్టిన్ జార్జ్ మసిహ్ లతో కూడిన దిసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలు పంపిణీ మంచిపద్దతి కాదని వెల్లడించింది. ఉచితంగా రేషన్, డబ్బు లు ఇస్తుంటే ప్రజలు పనిచేసేందుకు ఇష్టపడరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దురదృష్టావశాత్తు ఉచితాల వల్ల ప్రజలు పనిచేయడానికి ఇష్టపడడం లేదని పేర్కొంది. ఏ పనిచేయకుండా డబ్బు లు వస్తున్నాయని సుప్రీంకోర్టు తెలిపింది. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న ఉద్దేశం మంచిదేనని, అయితే వారిని సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని పేర్కొంది. పట్టణాల్లో పేదరికాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని కేంద్ర ప్రభుత్వం తరుపున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సుప్రీంకోర్టుకు తెలిపారు.





## కార్యకర్తలకు అన్నలా ఉంటా..

'ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త తరపున చంద్రబాబుకు చెబుతున్నా... మళ్లీ వచ్చేది జగన్ 2.0 పాలన. అన్యాయాలు చేసే వారెవరినీ వదిలిపెట్టేది లేదు. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతాం. కార్యకర్తలకు అన్నలా ఉంటా..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసానిచ్చారు. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

ప్రజలకు తోడుగా.. కార్యకర్తలకు అండగా
జగన్ 1.0 పాలనలో అధికారంలోకి వచ్చిన 9 నెలలు కాకముందే ఎప్పుడూ చూడని విధంగా కోవిడ్ పరిస్థితుల మధ్యే కాలం గడిపాం. తర్వాత రెండున్నర సంవత్సరాలు కోవిడ్ మధ్యే ఉన్నాం. ఆ టైంలో ప్రజలకు ఎలా తోడుగా ఉండాలనే తపనతో అడుగులు వేశాం. అందుకే కార్యకర్తలకు చేయదగినంత చేయలేకపోయాం. ఈసారి జగన్ 2.0లో ప్రజలకు తోడుగా ఉంటూ.. కార్యకర్తలకు అండగా, వారి ఇంటికి అన్నలా ఉంటా. మార్చి నాటికి స్థానిక సంస్థలకు నాలుగేళ్ల పదవీ కాలం ముగియబోతుంది. తమ వాళ్లను పదవుల్లో కూర్చోబెట్టడానికి ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ప్రయత్నిస్తారు. మన వాళ్లను భయపెట్టడానికి, లొంగదీసుకోవడానికి, ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తారు. ఇవన్నీ ఉన్నా మనం ధైర్యంగా ఉండాలి. ఎల్లకాలం ఇలా ఉండదు. చీకటి తర్వాత వెలుతురు రాక మానదు. రానున్న మూడు సంవత్సరాలు మన క్యారెక్టర్‌ను కాపాడుకుందాం. మన విలువలు కాపాడుకుందాం. ఆ తర్వాత రాబోయే మన ప్రభుత్వంలో అందరికీ దగ్గరుండి మేలు చేస్తాం. ప్రజాస్వామం గెలవాలి...

ఈరోజు టీడీపీ చేస్తున్నదేమిటి? ఇదా ప్రజాస్వామ్యం? అని అందరూ ఆలోచన చేయాలి. ఇలాంటి రాజ్యం పోవాలి. ప్రజాస్వామ్యం నిలవాలి. విలువలు, వ్యక్తి-త్వంతో కూడిన రాజకీయాలు అవసరం. కార్యకర్తలు ఫలానా వాడు మా నాయకుడు అని కాలర్ ఎగరేసుకుని తిరగాలి. ప్రజలు గొప్పగా చెప్పుకునేలా నాయకత్వం ఉండాలి. ఇదే వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం.

స్కాములు మినహా పాలన ఏది?
స్కాములు మినహా ఈ ప్రభుత్వంలో ఏమీ జరగడం లేదు. ముఖ్యమంత్రిగా పాలన సాగించేటప్పుడు ఆ పార్టీకి సంబంధించిన ప్రతి కార్యకర్త ఫలానా వ్యక్తి మా నాయకుడు అని కాలర్ ఎగరేసుకుని చెప్పుకునేలా ఉండాలని అనుకుంటారు. కానీ ఇవాళ పరిస్థితి చూస్తే... చంద్రబాబు, కూటమి నేతలు అధికారంలో ఉంటూ దోచుకోవడం, దోచుకున్నది పంచుకుని తినడం మాత్రమే జరుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం స్కామ్, ఇసుక స్కామ్. ఓ నియోజకవర్గంలో మైనింగ్ జరగాలన్నా, ఫ్యాక్టరీ నడపాలన్నా ఎమ్మెల్యేకు ఇంత ఇవ్వాలి.. ఆయన చంద్రబాబుకి ఇంత ఇవ్వాలి! ప్రతి నియోజకర్గంలోనూ యథేచ్ఛగా పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని చిన్న పిల్లలని కూడా చూడకుండా 111 సెక్షన్ కేసులు పెడుతున్నారు. తమ తప్పులను సోషల్ మీడియాలో ప్రశ్నించి పోస్టింగులు పెట్టేవారిపై టెర్రరిస్టుల మాదిరిగా వ్యవస్థీకృత నేర చట్టాల కింద కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారు. వివిధ స్టేషన్లు, జిల్లాల చుట్టూ తిప్పుతున్నారు. కానీ చంద్రబాబు మర్చిపోతున్న విషయం ఏమిటంటే... ఇలాంటి అన్యాయాలు చేస్తే ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం.

## మేడారంలో కొనసాగుతున్న మినీజాతర

మేడారంలో మినీజాతర కొనసాగుతోంది. బుధవారం రాత్రి పూజారులు సమ్మక్క పూజ మందిరం నుంచి పసుపు, కుంకుమ, నైవేధ్యం తీసు కువచ్చి సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆదివాసీల నృత్యాలు, డోలు వాయిద్యాలతో మేడారం మారు మ్రోగింది. తాడ్వాయి మండలం, మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండమెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు.వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప దూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్ఠి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు.

